హై టెన్షన్ తీగలు.. నిత్యం టెన్షన్



ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు


● భయం గుప్పిట్లో భూలక్ష్మీనగర్ బస్తీవాసులు ● భూగర్భ కేబుళ్లుగా ఏర్పాటు చేయాలని వినతి

సైదాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగా అక్కడి వారి ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి. ఎప్పుడు ఏ తీగ తెగి, ఎవరి మీద పడుతుందో అనే ఆందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు. సైదాబాద్ డివిజన్ భూలక్ష్మీనగర్ (భూలక్ష్మమ్మ హరిజనబస్తీ)లో హైటెన్షన్ విద్యుత్ తీగల కారణంగా స్థానికులు భయం గుప్పిట బతకాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ బస్తీలో 110 ఇళ్లు ఉండగా అందులో 50 గృహాల వారికి విద్యుత్ తీగల భయం పట్టుకుంది. ముఖ్యంగా ఈదురు గాలులు, వర్షాలు కురిసిన సమయంలో విద్యుదాఘాతం సంభవించి గృహోపకరణాలు, విద్యుత్ మీటర్లు కాలిన సంఘటనలు అనేకం ఉన్నాయి. కొన్నిసార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నా అదృష్టవశాత్తు గాయాలతో బయటపడిన సంఘటనలు చాలా ఉన్నాయి. హైటెన్షన్ విద్యుత్ తీగలు తొలగించి భూగర్భ కేబుళ్లుగా మార్చాలని 20 ఏళ్లుగా బస్తీవాసులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో బస్తీవాసులు భయంతో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



భూలక్ష్మీనగర్ (భూలక్ష్మమ్మ హరిజనబస్తీ)

చాలాసార్లు ఫిర్యాదు చేశాం



హైటెన్షన్ విద్యుత్ తీగల కారణంగా దినదిన గండంగా బతుకుతున్నాం. పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. సమస్య పరిష్కరించాలని అధికారులకు పలు మార్లు విన్నవించాం. అయినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. హైటెన్షన్ తీగల కారణంగా ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని ఆందోళన చెందుతున్నాం.

- బుచ్చయ్య, బస్తీవాసి

ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టాలి



ఇళ్లమీద నుంచి వెళ్తున్న హైటెన్షన్ తీగల కారణంగా ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి, చిన్నపాటి వర్షం కురిసినా భయంతో ఉంటున్నాం. తరుచుగా గృహోపకరణాలు కాలిపోతున్నాయి. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలకే ప్రమాదం. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టిపెట్టాలి.

- విజయ, స్థానికురాలు

సమస్య పరిష్కారానికి కృషి చేస్తా



ఇళ్లపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ తీగల సమస్యను ఇప్పటికే పలుమార్లు విద్యుత్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎప్పటికప్పుడూ తొలగిస్తామని చెబుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో బస్తీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. త్వరలో విద్యుత్ హైటెన్షన్ సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తా.

- కొత్తకాపు అరుణారెడ్డి, కార్పొరేటర్, సైదాబాద్



ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన శంకర్‌రెడ్డి తదితరులు

మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగరాల్సిందే

● పార్టీ నేతలతో ఎంపీ ఈటల రాజేందర్

సరూర్‌నగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా కార్పొరేషన్లలో పార్టీ పరిస్థితిపై, పార్టీ మరింత బలోపేతం కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మహేశ్వరం నియోజకవర్గంలో 2028 ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాల్సిందేనని, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను అక్కడి నుంచి తరిమేయాలని ఆయన వారికి సూచించారు. రాష్ట్రంలోనూ పార్టీకి అనుకూల పవనాలు ఉన్నాయని, పార్టీ శ్రేణులు గట్టిగా పని చేస్తే అధికారం ఖాయమని ఈటల పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యెడ్ల మల్లేశ్‌ముదిరాజ్, కొండ్రు గౌరీశంకర్, జిల్లెల అరుణాప్రభాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు కొత్త రాజేశ్‌రెడ్డి, రామిడి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



దేవీ జాగరణ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి

వైభవంగా దేవీ జాగరణ్

సరూర్‌నగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ రాఘవనగర్‌కాలనీలో శనివారం రాత్రి స్థానిక భక్తుడు అవినాశ్ ఆధ్వర్యంలో దేవీ జాగరణ్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రత్యేక పూజలు, అర్చనలు చేసి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి హాజరై పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. కార్యక్రమంలో మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, నాయకులు దీప్‌లాల్‌చౌహాన్, మాదరి రమేశ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రామస్, జిల్లా విజయ్, భరత్ పాల్గొన్నారు.

గుర్రంగూడలో అయ్యప్ప ఇరుముడి పూజోత్సవం



పడిపూజలో పాల్గొన్న మేయర్ పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్ కార్పొరేషన్ గుర్రంగూడలోని హనుమాన్ ఆలయం ఆవరణలో ఆదివారం అయ్యప్ప స్వాముల ఇరుముడి ధారణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పలువురు గురుస్వాములు హాజరై స్థానిక అయ్యప్ప స్వాములకు ఇరుముడిధారణ చేశారు. అనంతరం పడి వెలిగించారు. బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొనగా గురుస్వాములు ఆమె కు ఆశీర్వచనం అందజేశారు. గుర్రం లక్ష్మారెడ్డి, జక్కిడి విష్ణువర్ధన్ రెడ్డి, ముత్యంరెడ్డి, రాకేశ్‌గౌడ్, సామ సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేద హవన మహోత్సవాలు

మన్సూరాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ జనప్రియ ఎన్‌క్లేవ్ పార్కులో ఆరు రోజులుగా జరిగిన వేద హవనం సహిత గజేంద్రమోక్ష ప్రవచన పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు కనులపండువగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం మహాపూర్ణాహుతి, రుక్మిణీ కల్యాణ వేడుకలు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కాగా సాయంత్రం చేపట్టిన శ్రీరామ పల్లకీసేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హనుమాన్ అభిషేకం, గణపతి హోమంలో పాల్గొన్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ఘనంగా ఆంజనేయస్వామి అభిషేక, గణపతి హోమం

హయత్‌నగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ వీరన్నగుట్టపై హనుమాన్ దీక్ష స్వాములు ఆదివారం ఆంజనేయ స్వామి అభిషేకం, గణపతి హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు గంటల పాటు హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున ఆంజనేయస్వామి మాలధారణ స్వాములు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

సంతోష్‌నగర్‌లో స్వచ్ఛతా పఖ్వాడా

సంతోష్‌నగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్‌లోని ఐసీఏఆర్- సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్ క్రిడాలో డిసెంబరు 16 నుంచి 31వ తేదీ వరకు స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమాన్ని అమలుపరిచారు. కార్యాచరణ ప్రణాళికల ప్రకారం ఐసీఏఆర్- క్రిడా డైరెక్టర్ డాక్టర్ వి.కె సింగ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ తా పఖ్వాడాలో భాగంగా ఆదివారం పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించేందుకు క్రీడా క్యాంపస్ నుంచి ఐఎస్‌సదన్, సంతోష్‌నగర్ వరకు స్వచ్ఛతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వీటితో పాటు క్లీనెస్ డ్రైవ్, ప్లాంటేషన్ డ్రైవ్, వృథా నుంచి సంపదపై సాంకేతిక ప్రదర్శన, స్వచ్ఛతాథీమ్‌పై క్విజ్, రంగోలి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది, క్రిడా సిబ్బంది, ఐఏఆర్ఐ మెగా యూనివర్సిటీ హైదరాబాద్ హబ్ నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

అక్షరాస్యతను వ్యాప్తి చేసిన వెంకటరామారెడ్డి

● ఘనంగా రెడ్డి హాస్టల్ మొదటి అలూమ్ని

అఫ్జల్‌గంజ్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి తెలంగాణ అంతటా అక్షరాస్యతను వ్యాప్తి చేయాలనే సంకల్పంతో అనేక విద్యాసంస్థలకు ప్రాణం పోశారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఆబిడ్స్ రెడ్డి హాస్టల్ ఆవరణలో రాజా బహదూర్ వెంకటరామారెడ్డి హాస్టల్ మొదటి అలూమ్ని మీట్ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వెంకటరామారెడ్డి 22 విద్యా సంస్థలను స్థాపించి, తన చివరి రోజుల వరకు వాటికి అధ్యక్షుడిగా పనిచేశారని మంత్రి వెల్లడించారు. దూరదృష్టి, అంకితభావం కలిగిన సంఘ సంస్కర్త, రాజా బహదూర్ వెంకటరామారెడ్డి అని, వారు మహిళల అభ్యున్నతి కోసం అనేక చర్యలు తీసుకున్నారన్నారు. ప్రముఖులను తయారు చేసిన ఘనత రెడ్డి హాస్టల్‌కు ఉందన్నారు. రెడ్డి హాస్టల్‌లో ఉన్న ఎందరో విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, సైంటిస్టులుగా, వ్యాపారులుగా, రాజకీయ నాయకులుగా ఉన్నారని పేర్కొన్నారు. ఇదంతా కేవలం ఒక్క వ్యక్తివల్లే సాధ్యమైందని ఆయనే మన రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లాలోని రాయన్నిపేట అనే చిన్న గ్రామంలో జన్మించి.. కష్టపడి కొత్వాల్ స్థాయికి ఎదిగారన్నారు. రెడ్డి అంటే మానవత్వం, సమాజసేవ, కష్టానికి ప్రతిరూపమని ఒక ఊరు బాగుందంటే.. అక్కడ భూమిని నమ్ముకున్న రెడ్డి ఉంటాడని మంత్రి తెలిపారు.

సంక్రాంతి నాటికి రైతుభరోసా : దేప భాస్కర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నాటికి రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బు జమ చేస్తుందని పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన క్యారగారి శ్రీధర్ ఆదివారం అల్మాపురికాలనీలో పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలలో మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత, ఉద్యోగల భర్తీ, జాబ్ క్యాలెండర్ త్వరలో అమలులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, పందుల వెంకటేష్‌గౌడ్, జంగయ్య, పవన్, భిక్షపతి, దయాకర్, నర్సింగ్, భాను, జనార్దన్, విప్లవరెడ్డి పాల్గొన్నారు.



పీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీధర్

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి : మేయర్

సరూర్‌నగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్లలో గల కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆమె 20వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డితో కలిసి ఇక్కడి శ్రీవిద్యా టౌన్‌షిప్‌లో పర్యటించారు. కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక మహిళలు తమ సమస్యలను ఆమెకు వివరించారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో పారిజాతారెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం, అంతర్గత రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. దశలవారీగా ఆయా పనులు పూర్తి చేస్తామని, ఇతరత్రా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, నయనాచారి, గిరిముదిరాజ్, సుధాకర్, మనోహర్ పాల్గొన్నారు.




శ్రీవిద్యా టౌన్‌షిప్‌లో పర్యటిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

మద్యంతాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

● ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు

వనస్థలిపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 31న మద్యంతాగి వాహనాలు నడిపితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆటోనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడపడం మూలంగా ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. పోలీసులు సూచించిన విధంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలోనే డిసెంబర్ 31 వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లచ్చిరాంనాయక్



లచ్చిరాంనాయక్

హయత్‌నగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూరు సేవాలాల్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మునగనూరుకు చెందిన ఉదావత్ లచ్చిరాంనాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మునగనూరు టెలిఫోన్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో లచ్చిరాంనాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లచ్చిరాంనాయక్ మాట్లాడుతూ బంజారాల అభ్యున్నతికి, సంస్కృతీసంప్రదాయాలను కాపాడడానికి కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నాయకులు సూర్య రాథోడ్, ప్రధాన కార్యదర్శి బుక్యా రమేష్, కోశాధికారి రవికుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అగ్రికల్చర్‌కాలనీలో వాక్‌విత్ ప్రెసిడెంట్

చంపాపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్ కాలనీలో ఆదివారం వాక్‌విత్ ప్రెసిడెంట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీవాసులందరు కలిసి రహదారులు, పరిసర ప్రాంతాలలోని చెత్త, చెదారాన్ని శుభ్రం చేశారు. రహదారుల వెంట ఉన్న చిన్నచిన్న గోతులను పూడ్చారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ తిలకించిన బీజేపీ నాయకులు




మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని తిలకిస్తున్న బీజేపీ నాయకులు

హయత్‌నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దేశంలో జరిగే పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతి నెల ఆఖరి ఆదివారం నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు తూళ్ల నర్సింహగౌడ్ ఇంట్లో మున్సిపాలిటీ నాయకులు తిలకించారు. బీజేపీ, యువమోర్చా అనుబంధ సంఘాల నాయకులందరు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర దళిత మోర్చా నాయకుడు బచ్చిగళ్ల రమేష్, ఎంజాల శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్ : టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ ఇందు అరణ్యవిల్లాస్, ఇందుఅరణ్య అపార్ట్‌మెంట్, హౌసింగ్‌బోర్డు, తట్టిఅన్నారం, లక్ష్మీగణపతి, దేశ్‌ముఖ్‌కాలనీ, రాఘవేంద్రకాలనీ, లెక్చరర్స్‌కాలనీ, మదర్‌డైరీ, కొత్తపేట, న్యూమారుతినగర్, రాక్‌హిల్స్, విగార్డ్, సాయినగర్, గోటేటి ఫంక్షన్‌హాల్, శ్రీనివాసాకాలనీ, కల్వంచ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో చెట్లుకొట్టివేత, నిర్వహణపనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ ఇందు అరణ్యవిల్లాస్, ఇందు అరణ్య అపార్ట్‌మెంట్, హౌసింగ్‌బోర్డు, తట్టిఅన్నారం, లక్ష్మీగణపతి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 10.30గంటల వరకు, 11కేవీ దేశ్‌ముఖ్‌కాలనీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు, 11కేవీ రాఘవేంద్రకాలనీ, లెక్చరర్స్‌కాలనీ, మదర్‌డైరీ, ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30గంటల నుంచి 2.30గంటల వరకు, 11కేవీ కొత్తపేట న్యూ మారుతినగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4.30గంటల వరకు, 11కేవీ రాక్‌హిల్స్, విగార్డ్, సాయినగర్, గోటేటి ఫంక్షన్‌హాల్, శ్రీనివాసాకాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు, 11 కల్వంచ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



మహ్మద్ ఫయాజ్(ఫైల్)

చాదర్‌ఘాట్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చాదర్‌ఘాట్ ఎస్ఐ భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డెపల్లి మండలం, శాంతినగర్ గ్రామనివాసి పింజారి మహ్మద్ ఫయాజ్(25) పోటీ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నాడు. ఓల్డ్ మలక్‌పేటలోని వాహేద్‌నగర్‌లో గల అబుబాకర్ మసీద్‌లో గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆదివారం ఉదయం ఫయాజ్ నివాసముంటున్న గది నుంచి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చి చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు చేరుకుని ఫయాజ్ గది తలుపులు తెరచి చూడగా మృతిచెంది ఉన్నట్లుగా గుర్తించారు. నాలుగైదు రోజుల క్రితమే మృతిచెంది ఉంటాడని, మృత దేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడం ద్వారా స్పష్టమవుతుందని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఫయాజ్ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు మూర్ఛరోగంతో బాధపడుతున్నాడని, అతని మృతికి అది ఒక కారణమై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హైదరాబాద్ జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరావు

డీసీసీబీ క్యాలెండర్ ఆవిష్కరణ

హయత్‌నగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆబిడ్స్‌లోని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుకు చెందిన నూతన సంవత్సరం 2025 క్యాలెండర్, డైరీని ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు రైతులు సకాలంలో పంట రుణాలు అందించాలని కోరారు. బ్యాంకు రుణాలపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డీసీసీబీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, టెస్కాబ్ ఎండీ గోపీ, సీజీఎం జ్యోతి, వివిధ జిల్లాల డీసీసీబీల చైర్మన్లు భోజిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, నాగేశ్వరరావు, విష్ణువర్ధన్‌రెడ్డి, కుంట రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు చంద్రశేఖర్, మిగులయ్య, ఆనంద్, బాల్‌రెడ్డి, బ్యాంకు సీఈవో భాస్కర్, సుబ్రహ్మణ్యం, జీఎంలు ప్రభాకర్‌రెడ్డి, ఫణికుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్..

చంపాపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీలా మధుసూదన్‌గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం 2025 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా, పొలిటికల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ చింతల రవికుమార్ హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశంగుప్తా, కోశాధికారి బిల్లకంటి కిరణ్‌కుమార్ గుప్తా, డివిజన్ గౌరవాధ్యక్షుడు కాసుల శ్రీనివాస్‌గుప్తా, కమిటీ సభ్యులు బిజ్జాల వేణుగుప్తా, సుధాకర్‌గుప్తా, భాస్కర్‌గుప్తా, గణేష్‌గుప్తా పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

బ్రాహ్మణ సంఘం క్యాలెండర్..

సరూర్‌నగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం-2025 క్యాలెండర్‌ను ఆదివారం ఇక్కడి కాశీబుగ్గ క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు, గౌరవాధ్యక్షుడు తుంగతుర్తి మోహన్‌రావు తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, బ్రాహ్మణ అభ్యుదయ పరిషత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ శతాబ్ది ఉత్సవాల పోస్టర్..

కొత్తపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకులు ఆదివారం న్యూనాగోల్‌లోని ఎస్‌కే డాంగే భవన్‌లో సీపీఐ శతాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణ మోహన్‌నగర్ సీపీఐ శాఖ కార్యదర్శి వీ.మల్లేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల వేళ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసే ప్రదర్శనలను జయప్రదం చేయాలన్నారు. ఈనెల 30న నల్లగొండలో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జైపురికాలనీ కార్యదర్శి ఎండీ బషీర్, ఉప్పల మండల కౌన్సిల్ సభ్యుడు రాసమల్ల రాజేందర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786